

కావుటూరు
వేంకట నారాయణరావు

దీపావళి కథల పోటీలో
మొదటి బహుమతి
పొందిన కథ



రెండు పాత చెప్పులు గిరవాటుగా కింద పడ్డాయి టపీమని శబ్దంచేస్తూ.

చెప్పులు కుడుతూన్న రంగయ్య తలఎత్తి చూచాడు. అతని కాలి బొటన వేలికింద ఓ చెప్పు అదిమిపెట్టి ఉంది. చెప్పులోకి సగంసూది దిగిఉంది. వేలితో లాగుతున్న దారం, దారపు ఉండ మెల్లిగా కదులుతున్నాయి.

సాగుతూన్న పని ఆగిపోయింది. ఆ సంవత్సరమే బళ్లో చేరిన ఎనిమిదేళ్ళ కొడుకు రవణ ఆగుపించాడు.

“యాడివిరా యియి రవణా?” ముఖం చిట్లించి చూస్తూ అడిగాడు రంగయ్య.

భుజానికి తగిలించుకుని ఉన్న పుస్తకాలసంచీ చేతికి తీసుకున్నాడు రవణ. సంచిలో పలకా బలపం, ఒకటో తరగతి తెలుగు పుస్తకం, ఎక్కాలపుస్తకల ఉన్నాయి. అవిఅన్నీ వాడికి ఎవరో ఒకరు దానం చేసినవే.

నేలమీద కాలిబొటనవేలితో గుండ్రాలు గీస్తూ “మా అయ్యోరియి... పంతులు గారియి. బాగసేసి ఎంటనే తెమ్మన్నాడు!” అన్నాడు రవణ.

రంగయ్య ముఖం విప్పారింది. ముసలితనానికి చిహ్నంగాఉన్న అందులోని ముడతలు విచ్చుకున్నాయి. “పంతులుగారియా? మరిసెప్ప యేంరా?” అని చెప్పులను చేతికి తీసుకుని చూచి “మా అయ్యోరికి ఇట్లాంటి సెప్పు లేదయిరా? తాత ముత్తాతల్నాటియి లాగున్నా యే!” అన్నాడు.

“ఏమో నాకు తెలవదు!” అన్నాడు రవణ. వాడికి అక్కడ ఉండను బుద్ధిపుట్టలేదు.

ఆ చెప్పులు బాగుచెయ్యను వీలులేనంతగా పాడైపోయి ఉన్నాయి. తోలు పూర్తిగా అరిగిపోయి ఉంది. లోపలి అట్టలు బయటపడి ఉన్నాయి, రంగయ్య శరీరం లోంచి బయటపడి ఉన్న ఎముకలతో పోటీచేస్తూ. కుట్లు పూర్తిగా తెగి ఉన్నాయి.

పక్కనే ఉన్న డబ్బాలోని నీళ్ళతో చెప్పుల్నితడిపి “ఈ సెప్పుల్ని బాగాసేసేదానికన్నా కొత్తసెప్పుల్ని కుట్టడం సులబంరా రవణా!” అన్నాడు రంగయ్య.

“అయ్యోరొద్దన్నాడు నాయనా. ఈట్నే బాగా సేసి తెమ్మన్నాడు... యిప్పుడే గావాలంట!” అన్నాడు రవణ.

వాడి దృష్టి దుమ్మురేపుకుంటూ వెళ్ళిన నల్లటి కారుమీద పడ్డది. రంగయ్యమాత్రం చెప్పులను పరిశీలనగా చూస్తూ కూర్చున్నాడు. అతనికి తలవంచుకుని చెప్పులు కుట్టడంతప్ప మరొక ప్రపంచం తెలియదు. అదేచోటున కూర్చుని యాభై సంవత్సరాలకు పైనే గడిపాడు. లోకంలో ఎన్నోమార్పులు జరిగాయిగనీ, అతని జీవితంలో మటుకు ఏ మార్పూ రాలేదు.

“యీలుగాదురా. సందేలకైతే.... ఊఁ సరేలే నేనేదో ఒకటి సేస్తా... నువ్వు బడెగ్గొట్టి వొచ్చా

చెప్పులంటూ?" అని కొడుకువైపు అనుమానంగా చూచాడు రంగయ్య.

"ఉహూఁ. ఒంటేలుగంట కొడితే వచ్చా!"

"సరేలే ఎల్లు!"

రవణ కదల్లేదు. "నాన్నా...నా...యు..నా..నాన్నా!" అని నసగసాగాడు.

"ఏరా?"

"నాయనో!" మరలా నసిగాడు రవణ.

"ఏరా ఏంగావాల?" విసుక్కుని కొడుకును చూచాడు రంగయ్య.

కొడుకు వాలకం అర్థమయింది రంగయ్యకు. నవ్వుకున్నాడు, ఈ కాలం డబ్బుతో అవసరంలేని దెవరి కనుకుంటూ.

అయిదుగురిని పోగొట్టుకున్న తరవాత కలిగినవాడు రవణ. వాడు పుట్టీ పుట్టడంతోటే వాడి తల్లిపోయింది. అప్పటినుంచీ గారాబంగా పెంచుతున్నాడువాణ్ణి రంగయ్య. వాణ్ణి ఏమనాలన్నా మనసురాదు.

"డబ్బులు గావాలంట్రా?"

అనగా తలాడించాడు రవణ అవునన్నట్టు.

బనీను జేబులోంచి చిల్లరతీసి, అందులోంచి అయిదుపైసలబిళ్ళ అందుకుని, తిరిగి చిల్లర జేబులో పోసుకున్నాడు రంగయ్య.

రవణ దృష్టి ఆ అయిదుపైసల బిళ్ళమీద నిలిచి పోయింది. ఆత్రంగా చూడసాగాడు. ప్రపంచమంతా వాడి కదిగానే అగుపించసాగింది. ఉండబట్టలేక చివాలున ఆ అయిదుపైసల బిళ్ళ తండ్రి చేతిలోనించి లాక్కుని పరిగెత్తాడు. "వస్తా నాన్నో!" అంటూ.

"రవణా... రేయ్!" కేకావేశాడు రంగయ్య.

వాడు వినిపించుకోలేదు. వాడి ఆనందం వాడిది. పిల్లవాడిచేతిలో పైసాపెడితే, అది తల్లి ఒడికంటే ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందేమో!

కొడుకు వెళ్ళినవైపే చూస్తూ స్తంభించిన రంగయ్య కాసేపటికి తేరుకుని, నవ్వుకున్నాడు. నాకూ ఒక కొడుకున్నాడనీ, అందరిపిల్లల్లాగా గాకుండా చదువు కుంటున్నాడనీ గర్వంతో అదోలా చూచాడు. ఆగర్వం అతని మనసును కరిగించివేసింది. కరిగిన మనసు ఆనంద బాష్పాలుగా బుగ్గల మీదినుండి జారిపోయింది.

ఆశలన్నీ రవణమీదే పెట్టుకున్న రంగయ్యకు వాడు బాగా చదువుకోవాలనీ, గొప్పవాడు గావాలనీ తప్ప మరొకటిలేదు. వాడు సాటికులంలోని ఇతరపిల్లల్లా దేనికీ కాకుండా పోగూడదు.

అదృష్టం కొద్దీ రవణకి తన ఇంట్లోనే అన్నంపెట్టి చదివిస్తున్నాడు పంతులుగారు. ఆయన ఋణం తీర్చు కుంటే తీరేదిగాదు.

రంగయ్య హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. వీధిబడి నడుపుతూన్న పంతులుగారు కళ్ళముందు మెదిలాడు — ఆయన, ఆయన తెల్లటిదేహం, నడి నెత్తిన పండిన పిలక, ముఖాన విభూతిరేఖలు, చందనవు బొట్టు, గోచిపోసి కట్టిన నీరుకావి పంచ, పైన ఖద్దరు శాలువ!

ఓసారి వెళ్ళి ఆయన కాళ్ళమీదపడి మొక్కిరావాలని పించింది రంగయ్యకు. అంతేగాదు. రవణ బళ్ళోచేరి నప్పటినుండీ వాడెలా చదువుకుంటున్నాడో చూడాలనే ఆశా ఉంది. ఒక్కసారి ఆవైపువెళ్ళితే ఆరెండుకోరికలూ తీరతాయి.

పక్కన్నే ఉన్న టీ బంకునుంచి సిలోన్‌పాటలు విన వస్తున్నాయి. అటువైపు చూచాడు రంగయ్య. కళాత్మకంగా టీ కలుపుతున్నాడు, పులిచారల బనీను తొడిగి ఉన్న ఓ యువకుడు. అతన్నిచూచి "సింగిలు టీ!" అన్నాడు రంగయ్య.

టీ వచ్చేలోపల ఓ రూపాయి డబ్బుల బేరాలు వచ్చాయి. బూట్లు పాలిష్ చెయ్యాలి. సైకిల్ ట్యూబు కుట్టాలి. చెప్పులు బాగుచెయ్యాలి. లాడాలుకొట్టాలి!




ఆగండి!

మీ గుడ్డల ఖర్చు ఎక్కువై పోతున్నదా?

అయితే ట్విన్ టస్కర్ గురించి మీరు చేసిన దీర్ఘాలోచనకి యిది సరైన సమయం అన్నమాట! ఈ వస్త్రాలలోని వైవిధ్యాన్ని మీరు యిష్టపడరారు.... మధుర మిల్స్ వారి భారీ ఉత్పత్తి అవకాశములవలన గట్టితనము, ఎక్కువకాలం మన్నిక, అద్భుతమైన పనితనము, సరసమైన ధర నిర్ణయము సాధ్య పడినవి. జ్ఞాపకముంచుకోనండి, సరసమైన ధరకు లభించే నాణ్యతకు ట్విన్ టస్కర్!

మధుర మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై
మేనేజింగ్ ఏజంట్లు : ఎ & ఎఫ్ హార్వే లిమిటెడ్

హార్వే

ట్విన్ టస్కర్

పాప్లిన్ • డ్రిల్ • లాంగ్‌క్లాత్

సరసమైన ధరకు నాణ్యత!

మధురకు చేరిన హార్వేస్

147 / TEL

ఓ అయిదు నిమిషాలు తీరిగ్గా కూర్చుని టీని ఆర్పుకుంటూ తాగి, ఆ గ్లాసుతో ఏడు పైసలు వేశాడు రంగయ్య. ఓ కుర్రవాడు వచ్చి గ్లాసు తీసుకుని టీ బంకులోకి వెళ్ళాడు.

వచ్చినవారి పనులన్నీ చెయ్యను అరగంటపైనే పట్టింది రంగయ్యకు. ఆ తరవాత ఒక పక్కన పెట్టి ఉన్న పంతులుగారి చెప్పులను అందుకున్నాడు. అవి సాధారణమైన చెప్పులే అయినా పంతులుగారివి కావడం వల్ల మహిమాన్వితంగా అగుపించాయి. వాటిని కళ్ళకద్దుకుని "యీాట్నీ బాగుసేత్తాను, కొత్త సెప్పులు కుట్టిత్తాను!" అనుకున్నాడు రంగయ్య.

వెంటనే బడి దగ్గిరికి బయలుదేరాడు, ఆ చెప్పులను ఇతర సరంజామానూ సంచిలో దాచి ఒక పక్కన పెట్టి!

మెల్లిగా కూచున్నచోటినుండి లేచిన రంగయ్య చేతికి బనీను జేబులోని చిల్లర తగిలింది. వెంటనే ఆ చిల్లర అంతా బయటికితీసి జాగ్రత్తగా లెక్క పెట్టుకున్నాడు. మొత్తం ఆరు రూపాయలా ఇరవై పైసలు! అతని పెదవుల సందున ఆనందం తాండవించింది. అది నిన్నటి కష్టార్జితం.

కాస్త వంగిన నడుము పట్టుకుని ఉత్సాహంగా ముందుకు సాగాడు రంగయ్య. పక్క వీధిలో ఉన్న బడి దగ్గిరగానీ ఆగలేదు.

అదొక చిన్న పెంకుటిల్లు. ముందు ఇరువైపులా అరుగులున్నాయి. అరుగుల మీదగూడా బడి సాగుతూంది. ఇద్దరు ఉపాధ్యాయులు చెరొక అరుగుమీద కూర్చుని పాఠాలు చెబుతున్నారు.

పంతులుగా రెక్కడున్నారోననే అనుమానం వేసింది రంగయ్యకు. నేరుగా లోపలికి వెళ్ళి చూడను ధైర్యం చాలలేదు. అక్కడే నిలబడిపోయాడు.

ఒక ఉపాధ్యాయుడు పిల్లలచేత ఏదో వల్లె వేయిస్తున్నాడు. అతనొకమారు చెబితే పిల్లలంతా కలిసి మళ్ళీ చెబుతున్నారు. ఆ ముక్తకంఠంలోంచి వెలువడుతున్న ధ్వని సంగీత సౌందర్యాన్ని వెదజల్లుతూ, రంగయ్యకు గంభీరంగానూ, మధురంగానూ వినిపించింది. కాస్సేపు తన్మయత్వం చెందాడు.

రెండు మూడు నిమిషాలు గడిచాయి. కాలం క్షణక్షణం సాగుతూంటే తన కొడుకెలా చదువుకుంటున్నాడో చూడాలనే ఆశ, ఆశతోపాటు ఆత్రత ఒకదాన్ని ఒకటి తరుముకు పోసాగాయి. లోపలికి వెళ్ళి చూచే ధైర్యం లేకపోయినా, తెగించి అరుగుల నడుమ ఉన్న మెట్లెక్కుతూ ఆగిపోయాడు రంగయ్య.

"ఎవరండీ మీరు? . . . ఎవరు కావాలి?" ఒక ఉపాధ్యాయుని కంఠం వినిపించింది.

రంగయ్య వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. చెయ్యగూడని పని చేస్తున్నానేమో ననే భయం గూడా కలిగింది.

". . . మా . . . నేను . . . అదే మా రవణ్ణి సూడాలని . . . నా కొడుకు . . !" తడబడ్డాడు రంగయ్య.

"మీ అబ్బాయిని చూడాలా?"

"ఆఁ."

"ఏ తరగతి?"

"ఒకటి!" వేలెత్తి చూపాడు రంగయ్య.

"అయితే నేరుగా సందులోకి వెళ్ళండి. వసారాలో ఉందా తరగతి!" అన్నాడు ఉపాధ్యాయుడు.

ఏదో గండం గడిచినట్లు భావించాడు రంగయ్య. నేరుగా సందులోకి వెళ్ళగానే తలఎత్తి చూడలేదు. ఎదురుగా ఉన్న వసారాలో అందరి పిల్లలతోపాటు కూర్చుని గుణింతం చెబుతున్న రవణ అగుపించాడు.

పలకా బలపం పట్టుకుని అక్షరం ముక్క నేర్చుకునే అదృష్టం తనకు లేకపోయినా, తన కొడుకు చదువుకుంటున్నాడు!

రంగయ్య ఆనందం పట్ట పగ్గాలు లేకుండాపోయింది.

పంతులుగారు ఓ స్టూలుమీద కూర్చుని పిల్లలచేత మాటలు పలికిస్తున్నారు. ఆయన చేతిలో పెద్దబాలశిక్ష ఉంది.

"మ . . . న కు . . .మ ఒత్తిస్తే...న్మ...థు... డు... మన్మథుడు!"

పలుకుతూన్న రవణ తల తిప్పి చూచాడు. తండ్రి అగుపించాడు. వెంటనే "నాయనో! . . .నాన్నో!" అన్నాడు.

పంతులుగారు అటువైపు చూచారు. రంగయ్య. చేతులుకట్టుకుని అణిగి మణిగి నిలబడి ఉన్నాడు. ఆయన లేచివచ్చి "ఏం రంగయ్యా, బాగున్నావా? . . . ఎంతసేపయింది వచ్చి?" అని అడిగారు.

"ఇప్పుడే ఒచ్చానయ్యగారో! మా రవణ్ణి సూడాలనిపించింది. ఒచ్చా!" అన్నాడు రంగయ్య.

"దానికేం. వాడుగో రవణ. . . రారా!"

"ఒద్దులెండి అయ్యగారో. సదువుకోనియ్యండి!"

"ఊఁ. మా బడి అంతా చూపుతా రా!"

"ఎందుకు లెండయ్యగారో! ఓడు బాగా సదువుకుంటున్నాడా?"

"దర్జాగా. ఏవోఁ అనుకున్నాగానీ అసాధ్యుడే. అప్పుడే పెద్దబాలశిక్ష చదివేస్తున్నాడు!" అని తన చేతిలోని పుస్తకం చూపాడు పంతులు.

"నిజంగానా అయ్యగారో! . . . ఇంత పెద్ద పుస్తకవేఁ . . నేను కోరేదీ ఇదే. నా సెర్మం ఒలిసి నీాకు సెప్పులు కుట్టిచ్చినా మీా ఋణం తీరదు!" అని చివాలున వంగి ఆయన పాదాలు పట్టుకుని "ఓణ్ణి బాగా సదవెయ్యండయ్యగారో!" అన్నాడు రంగయ్య.

రంగయ్య అలా కాళ్ళమీద పడతాడని పంతులుగారనుకోలేదు. పిల్లలు, రవణ అదంతా ఏమిటోఅన్నట్లు ఎంతగానో చూస్తూంటే "అబ్బే! ఇదేంటి రంగయ్యా!



అనురాగాల మతాబా          ఫోటో—ఎన్. రామకృష్ణ (మయూరం)

లే. ఎవరన్నా వొస్తే బాగుండదు! . . . రవణకేం? బాగా చదువుకుని రేపేపాటికి గొప్పవాడవుతాడు. నిన్ను కారులో కూర్చోబెట్టి తిప్పగలడు!" అన్నారు పంతులు గారు.

"అంత అదుట్టం గూడానా!" అని ముకుళిత హస్తాలతో లేచి "మీ చెప్పుల్ని సందేళకు బాగచేసి పంపిత్తా!" అన్నాడు రంగయ్య.

"అలాగేలే. కానీ సాయంత్రం నేనుండను. రేపు ఉదయాన్నే పంపు!"

"నేనే ఎత్తకొత్తానయ్యగారో!"

"మంచిది. ఇక నువ్వు వెళ్ళు. రవణ నీ కొడుకు గాదు, నా కొడుకనుకో! వాడి దిగులు నీ కక్కర్లేదు!"

ఆ మాటలు అమృత తుల్యంగా తోచాయి రంగయ్యకు. జేబులోనుంచి నాలుగు రూపాయలు తీసి పంతులుగారి చేతిలో ఉంచాడు. ఆయన వాటినిచూస్తూ "మొన్నటికి సరిగ్గా రెండు వందల రూపాయలు. దీనితో రెండువందలా నాలుగు. ఇలా కూడబెట్టి ఏం చెయ్యాలని?" అన్నాడు.

"మీ ఇట్టం వచ్చినట్టు సెయ్యండి. వత్తా!"

ఇంకొక్క క్షణం అక్కడాగలేదు రంగయ్య. సంతోషం దోవ చూపుతూంటే "వత్తారా రవణా" అని కొడుక్కి చెప్పి చరచరా వీధిలోకి వచ్చి నిలబడి, మరో మారు ఆ బడివైపు చూచాడు. అదొక స్వర్గధామంలా అగుపించింది. తనకంటే తన కొడుకు అదృష్టవంతుడనుకున్నాడు.

అనుకున్న ఆశ తీరడంతో తృప్తి పడ్డ రంగయ్య ముందుకు సాగిపోబోతూ ఆగి అరుగుమీద ఉన్న ఉపాధ్యాయుని దగ్గిరికి వెళ్ళాడు.

అతన్ని చూచి ఆ ఉపాధ్యాయుడు "ఏమండీ, మీ అబ్బాయిని చూచారా?" అని అడిగాడు.

"ఆఁ. నాదో సిన్న సందేగం!" వినయంగా అన్నాడు రంగయ్య.

"చెప్పండి!"

"నేనుకూడా సదువుకోవచ్చా?"

"ఎందుకు చదువుకోకూడదు?" అన్నాడు అంత వయస్సులో ఉన్న అతనికి ఆ ఆశ కలిగినందుకు ఆశ్చర్యపడుతూ ఉపాధ్యాయుడు.

"మరి రేపటినించి నేనూ ఇక్కడ కాసేపు కూకుని పోతా! పలకా బలపం కొనక్కు రమ్మంటారా? అక్కడ కూకుంటే మా రవణ నన్ను సూసి బెదిరిపోతాడు!" అన్నాడు రంగయ్య.

అతని అమాయికత్వానికి ఉపాధ్యాయుడు నవ్వి "మీకు చదువు చెప్పను వయోజన పాఠశాలలున్నాయి. అంటే రాత్రి బళ్ళన్నమాట. అందులో వెళ్ళి చేరండి!" అన్నాడు.

"అయ్యేంటో నాకు తెలవదే!"

"మరేం పరవాలేదు. రేపు సాయంత్రం ఇక్కడికి రండి. నేనే ఆ బడిలో మిమ్మల్ని చేర్పిస్తాను."

"తప్పకుండా ఒత్తా నయ్యగారో! మీరు నాకా సగాయం సేశారా మీకు సెప్పులు కుట్టిత్తా . . . దణ్ణాలు . . . ఒత్తా!"

"ఆఁ."

రంగయ్య సంబరపడిపోయాడు. తనూ వ్రాయనూ చదవనూ నేర్చుకున్నాడంటే తన కులంలోని వాళ్ళందరూ ఆశ్చర్యపడిపోతారు. ఆఁ. అయినా తనకు



దక్షిణామూర్తి ఉపదేశం

ఫోటో—పి. జి. శ్రీనివాసరావు (మదరాసు)

చెరువెందుకు? . . . ఛీ! ఛీ! అదేంటి? అందరూ చదువుకోవలసిందే. చదువుకు వయస్సు భేదంలేదు.... రవణలాగా తనూ!

ఎన్నో ఆలోచనలు! నడుంవంచి నడుస్తున్న రంగయ్యకు తనకంటే తన కొడుకు భవిష్యత్తు ఆనందదాయకంగా తోచింది. వాడు ముమ్ముందు పొందబోయే గౌరవాన్ని తలుచుకుని ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. వచ్చే సంవత్సరం రెండు. . . ఆ పైన . . మూడు ... నాలుగు . . . అయిదు!

అలా అలా పెద్ద చదువు చదివేస్తాడు!

నిజమే! పంతులుగారన్నట్టు రేపేపాటికి రవణ గొప్పవాడై పోతాడు.

టీ బంకు చేరుకోవడంతోటే తన సంచి తీసుకుని ఇంటికి బయలుదేరాడు రంగయ్య. ప్లాట్‌ఫారం మీద నడుస్తూ, మలుపు కాలవ వంతెన దాటి, సినిమాహాలు ముందున్న గుడిసెలు చేరుకున్నాడు.

ఎటువైపు చూచినా బైర్లు, తోళ్ళు, చెప్పులు. వాటిలాగే అక్కడి మనుషులూను! ప్రతి వ్యక్తికీ తాగడంలో ఉన్న నేర్పు మరి దేనిలోనూ అగుపించదు. వాళ్ళల్లో రంగయ్యేగానీ, రంగయ్య వాళ్ళల్లోవాడు గాదు.

మలుపు కాలవగట్టునే ఉంది రంగయ్య ఇల్లు. మూడు దూలాల పూరిపాక. ఆ గుడిసెల కది భవంతి. అతని ఆస్తిఅంతా అదే!

అలికి ముగ్గులు పెట్టి ఉన్న అరుగుమీద కూర్చున్నాడు రంగయ్య ఉసూరుమంటూ. అతని భుజం నుండి సంచీ దానంతటదే జారి పడ్డది. వయస్సు మళ్ళేకొద్దీ రంగయ్యలో జవసత్వాలుడిగిపోతున్నాయి. కొడుకును పైకి తీసుకురావాలనే ఆశ తప్ప మరేదీ అతన్ని నడిపించడం లేదు.

ఆ కాస్త దూరం ఎండలో నడిచేసరికి తల దిమ్మెక్కిపోయింది. కాసేపు సేద దీర్చుకుని తల పైకెత్తి చూచి కాలాన్ని కొలుచుకున్నాడు. పన్నెండు గంటలు కావస్తూంది. మెల్లిగా లేచి లోపలికి వెళ్ళి, కుండలో ఉన్న మంచినీళ్ళు ముంతతో తీసుకుని తాగి బయటికి రాబోతూ ఆగిపోయాడు.

ఎదురుగా గోడకు వెంకటేశ్వరస్వామి పటం వేలాడదీసి ఉంది. దాన్ని చూస్తూనే చేతులెత్తి నమస్కరించి, "సామే, నా కొడుకుని బాగా సదియించు. ఓడ్ని నీ కొండెక్కించి ఎంటిక లిప్పిస్తా. నేనూ ఇత్తా!" అని మొక్కుకున్నాడు.

దేవుడంటే రంగయ్య కున్నంత నమ్మకం మరెవ్వరికీ ఉండదేమో!

బయటికి వచ్చి తిరిగి అరుగుమీద కూర్చున్నాడు. కొందరు పిల్లలు సర్వ దుర్గంధానికీ ఆలవాలంగా ఉన్న కాలవ నీటిలో మునుగుతున్నారు. ఆడవాళ్ళు కొందరు గుడ్డలు ఉతుక్కుంటున్నారు.

రంగయ్య మనసు పంతులుగారి చెప్పుల మీద పడ్డది. వెంటనే సంచిలోనించి పంతులుగారి పాత చెప్పులను బయటికి తీశాడు. వాటిని కొత్త చెప్పుల్లా తయారుచెయ్యాలి. తనే స్వయంగా ఆయన కాళ్ళకు తొడగాలి. అంతకంటే గొప్ప పని మరి తను చెయ్యబడు.

"మావోఁ!" ఎవరిదో పిలుపు వినిపించింది.

తలెత్తి చూచాడు రంగయ్య. పదేళ్ళ పిల్ల కుళ్ళిపోయిన మామిడి పండు తింటూ అగుపించింది.

"ఏఁ యేఁ పోలే!"

"మా యమ్మకు...ఒళ్ళు బాగా లేదంట. ఇయ్యాల కూడు నిన్నే ఒండుకోమంది!"

రంగయ్య నిట్టూర్చాడు. "సరేలేయే. అవునుగానీ మీయమ్మ కేఁ యేఁ?"

"ఏమోఁ. నాకు తెలవదు మావాఁ. తలనొప్పంట!"

"అవున్లేయే. కడుపుతో ఉంద్గా. జాగర్తగా ఉండమను. పో!"

ఆ పిల్ల వెళ్ళిపోయింది.

రంగయ్య సంచిలోని సామానులు ముందువేసుకుని పంతులుగారి చెప్పులు బాగుచెయ్యను పూనుకున్నాడు. ఓపిగ్గా వాటిని కుట్టి, మళ్ళీ కొత్త చెప్పుల్లా చెయ్యను గంటసేపు పట్టింది, మెల్లిగా చేసేసరికి. పాలిష్‌చేసి ఒక పక్కన పెట్టి వాటి అందాన్ని కొలుచుకున్నాడు. బాగా అగుపించాయి. అవును మరి! చెప్పులు కుట్టడంలోగానీ, బాగుచెయ్యడంలోగానీ ఆతీతో రంగయ్యకు కొట్టే చెయ్యి లేదు.

బాగుచేసిన చెప్పుల్ని లోపలికి తీసుకువెళ్ళి అటక మీద ఉంచాడు. ఉన్నట్టుండి ఆకలి అతన్ని దహించివేసింది. తలుపు దగ్గిరికి లాగి, నేరుగా రోడ్డుమీదికి వచ్చాడు.

కొళాయిపక్కన్నే ప్లాట్‌ఫారం హోటలుంది.

ఓ ఆడమనిషి పెద్ద బుట్టనిండా అన్నం, కుండలో పులుసు, టిఫిన్ బాక్సులో మజ్జిగ పెట్టుకుని కూర్చుని ఉంది. నలుగురు రిక్షావాళ్ళు ఆమె చుట్టూరా కూర్చుని అన్నం తింటున్నారు.

రంగయ్య కొళాయి దగ్గిరికి వెళ్ళి కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కున్నాడు. బనీను కొసలతో తుడుచుకుంటూ వెళ్ళి "ఏయేఁ గంగా! ఇయ్యాల కూటో్లకేం

జేశావ్?" అని అడుగుతూ ఆమె పక్కన కూర్చున్నాడు.

"మునక్కాయ పులుసూ, గోగాకు పచ్చడీ . . . కూకో!" అంది గంగ.

"సాల్లేయే. ఓ ఇస్తరాకిట్టా పడెయ్!"

"కూకో మావా. నే పెడతాను!" అని గంగ పక్కన్నే ఉన్న విస్తరాకు అందుకుంది.

రంగయ్య ఓపికగా కూర్చున్నాడు. గంగ బుట్ట మీద ఉన్న గుడ్డ తొలగించి, అందు సగంవరకూ ఉన్న అన్నాన్ని చిన్న టెంకాయ చిప్పతో మూడుమార్లు కొలిచి పెట్టి రంగయ్య ముందు ఉంచి "పచ్చడా? పులుసా?" అంది.

"పచ్చడెయ్యి!"

గంగ అటకలో ఉన్న పచ్చడి తీసి అన్నంమీద వేసింది.

రంగయ్య ఆ అన్నానికి నమస్కరించి తిననారంభించాడు, గంగతో మాట్లాడుతూ. " . . ఏ యేఁ గంగా, యాపార మెట్టాగుందే?"

"ఊఁ. మంచి బియ్యం దర రూపాయ్మెపోయింది మావాఁ. గిట్టుబాటు గావడంలేదు. రేపట్నుంచీ పైన ముప్ఫయ్యైదు పైసలు వెయ్యాలనుకుంటుండా!"

"సేసెయ్యే సేసెయ్ . . . సెయ్. నీదేంపోయింది. ఊఁ పులుసెయ్!"

గంగ రెండు గరిటెలు పులుసు పోసింది. అన్నం అంతా దానితో తిని, మజ్జిగ తాగి ఒక చిన్న త్రేపు తేపాడు. వేళ్లను చీకుతూ కొళాయి దగ్గిరికి వెళ్ళి చేతులు కడుక్కుని పక్కన్నే ఉన్న గంగరాని చెట్టు కింద సేద దీర్చుకోను కూర్చున్నాడు. అలాగే కునుకుపట్టింది. నుగతగా నేలమీద వాలి నిద్రపోయాడు.

ఎంతసేపు నిద్రపోయాడో రంగయ్యకే తెలియదు. ఎవరో తట్టి లేపితే ఉలిక్కిపడి లేచి "ఏరా నారిగా . . . ఏంటి?" అన్నాడు.

"గుడిసెలు అంటుకున్నాయి తాతా! లేచిరా!" అని నారిగాడు పరిగెత్తాడు.

రంగయ్య గుండెలు ఝల్లుమన్నాయి. సినిమాహాలు వైపున పొగ ఆకాశాన్నంటుతూంది. చివాలున లేచి పరిగెత్తినట్టు నడవసాగాడు.

అప్పటికి నాలుగుగంట అవుతూంది. ఎక్కడ నిప్పు పడ్డదో ఎవ్వరికీ తెలియదు. మొత్తంమీద గుడిసెలన్నీ అంటుకుని మండుతున్నాయి. మంటలు ఆకాశాన్ని చుంబిస్తున్నాయి. ఏడ్పులూ పెడబొబ్బలూ తప్ప మరేమీ వినిపించడంలేదు. ఎవ్వరూ ఏదీ రక్షించుకోలేక పోతున్నారు! టైర్లు అంటుకుని పొగంతా టైరు వాసన కొట్టసాగింది. ధైర్యం ఉన్నవాళ్ళు మంటల్లో జొరబడి మండుతున్న టైర్లను కాలువలోకి దొర్లిస్తున్నారు. మంటలకు తోడు గాలి రివ్వునవీస్తూంది. ఎవ్వరూ సాహసించి ముందు అడుగు వెయ్యడంలేదు.

రంగయ్య రొప్పుతూ రొజుతూ వచ్చి తన ఇంటి వైపు చూశాడు. కప్పు పూర్తిగా అంటుకుంది. మంటల సెగ ముఖానికి కొడుతూంది.

పంతులుగారి చెప్పులు లోపలున్నాయి. రంగయ్య మనసు వాటికోసం తపించసాగింది. పక్కనే ఉన్న యువకుణ్ణి చూచి "అబ్బయ్యా, లోపలికెళ్ళి, అటక మీద సెప్పులున్నాయి . . . మా పంతులుగారియి.... లాక్కొస్తా. నీ కెంత డబ్బుగావాలంటే అంతా ఇత్తా!" అన్నాడు.

"నీకేవన్నా పిచ్చి పట్టిందా తాతా. సెప్పులకేంగానీ ముందు నీ సామాన్లు బయటేయించు!" అన్నాడతను.

రంగయ్యకు మనస్సుండబట్టలేదు. ఆ ఇంట్లో ఉన్న అమూల్యమైన వస్తువల్లా పంతులుగారి చెప్పులే! అవి కాలేదానికన్నా తను కాలడం మంచిది!

ఏదో ఆవేశం రంగయ్యను లోగొంది. చెప్పులేగదా! అంతకంటె మంచివి కుట్టివ్వవచ్చులెమ్మనుకోలేదు. ఆ ఆలోచనేరాలేదు రంగయ్యకు. ఒక్కసారి బలాన్నంతా కేంద్రీకరింపజేసి చరచరా కాలుతున్న ఇంట్లోకి అడుగు పెట్టాడు, తలుపు ఎగసితన్నుతూ.

అప్పుడే ఫైర్ ఇంజన్ గంట వినిపించింది.

ఎంతకూ రంగయ్య మటుకు బయటికి రాలేదు.

ఫైర్ ఇంజన్ సిద్ధమై నీళ్ళు కొట్టను మొదలుపెట్టింది. ముందుగా రంగయ్య ఇంటనే ఆర్పింది. నలుగురు లోపల అడుగు పెట్టారు. అక్కడ అగుపించిన దృశ్యం వాళ్లను భయకంపితులను చేసివేసింది.

రంగయ్య బోర్లా పడిఉన్నాడు. పైభాగం అంతా పూర్తిగా కాలిపోయి ఉంది. చర్మం కుతకుతలాడుతూంది.

"రంగయ్య కాలిపోయాడు!"

అందరికీ ఆ విషయం తెలిసింది. పరిగెత్తివచ్చి మొండిగోడల ముందు చేరిపోయారు. నలుగురు దగ్గిరికి వెళ్ళి మెల్లగా రంగయ్యను లేవదీశారు.

పంతులుగారి చెప్పులు రెండూ చెక్కుచెదరకుండా రంగయ్య పొట్టలో దాగిఉన్నాయి.

రంగయ్యలోని ప్రాణాలు పైకి లేచిపోవడం ఆ చెప్పులు తప్ప మరెవ్వరూ చూచిఉండరేమో! ★

# ఈనాడు దీపావళి

**చింతా బాలంభట్లు**

దేవతలు దివినుండి భువికివచ్చి,
దివ్వెల తోరణాలు వెలిగించేదినం!
కాంతి కిరణం వెలుగులో, ప్రశాంతి ప్రసవించి!
తిమిరం తొలగి, జ్ఞానోదయం కలిగేవేళ!

అశాంతి నిండిన మనసులలో
ప్రశాంతికి చోటెక్కడిది?

ప్రతిఒక్కరు తాను వేరనుకుంటే
ప్రతిభాషకు మరోభాష శత్రువైతే
మతోన్మాదంలో మనిషి పశువైతే
దేశం మరి ముక్కలు కాదా?

ద్వేషంలో రగిలిన మనసులు
దీపం వెలుగులో శోభిస్తాయా?

ఇరవైఏళ్ళ స్వాతంత్ర్యంలో
ఇరుకునపడ్డ మానవుడు
తిండీ, బట్టా కరవై
మతి స్తిమితం తప్పాడు.

మనం మనంగా మనుగడ పొందాలంటే
ప్రగతిలో ధైర్యంగా ముందడుగు వేయాలంటే
మరవరాని సత్యం — మరోమాటు చెబుతా!

మనది భారతదేశం మనం భారతీయులం!
భాషలు వేరైనా దేశం ఒక్కటే
దేశం లేనినాడు మనమూ లేము!

ఈనాడు దీపావళి!
వెలిగించవే చెల్లీ వెలిగించవమ్మా
ఐక్యమందించేటి అందంపు దివ్వే!